Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి సెల్ : 9440815774

ప్రచురణ : తిరుపతి | సంపుటి : 02 | సంచిక : 168 | అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు | శనివారం 20 జూన్ 2026 | పేజీలు : 4 | వెల : 2

## రాజ్యసభలో పెరుగుతున్న
# బీజేపీ బలం

- మూడింట రెండు వంతుల మెజారిటీ దిశగా ఎన్డీఏ..!
- వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఇప్పుడు రాజ్యసభలోనూ తన బలాన్ని మరింత పెంచుకుంటున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి
- ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల ఫలితాలు ఎన్డీఏకు అనుకూలంగా రావడంతో, ఆ కూటమి సంఖ్యాబలం గణనీయంగా పెరిగింది
- దీంతో భవిష్యత్తులో కీలక బిల్లులను ఆమోదించుకునే దిశగా బీజేపీ మరింత బలపడుతున్నట్లు కనిపిస్తోంది



## ఏపీలో వంద శాతం సినిమా షూటింగ్ చేస్తే
# భారీ సబ్సిడీ

- త్వరలోనే నూతన ఫిల్మ్ పాలసీ
- ఏపీని ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా మారుస్తాం
- ఈ ఏడాది ఆఖరులో నంది నాటకోత్సవాలు
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విజయవాడ**

ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా మార్చాలన్నదే తమ కర్తవ్యమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. రెండేళ్ల సుపరిపాలనలో పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల పురోగతిపై విజయవాడ బెర్మ్ పార్క్ లో శుక్రవారం ఆయన మీడియాకు వివరాలు - మిగతా3లో



## నీట్ రీ-ఎగ్జామ్‌కు
# లైన్ క్లియర్

- ఆ పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు
- నీట్ రీ ఎగ్జామ్ నిలిపివేయాలని పిటిషన్
- తిరస్కరించిన సుప్రీంకోర్టు
- పిటిషన్లను అత్యవసరంగా విచారించలేమని స్పష్టం

## ఆర్థిక కార్యకలాపాలు మరింత పుంజుకునేలా
# బ్యాంకర్లు సహకరించాలి



- సచివాలయంలో సీఎం అధ్యక్షతన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం
- ఎస్ఎల్‌బీసీ సమావేశంలో 2026-27 వార్షిక రుణ ప్రణాళికపై చర్చ
- వ్యవసాయ రంగం, ఎంఎస్ఎంఈ, స్వయం సహాయ సంఘాలపై సమీక్ష

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు మరింత పుంజుకునేందుకు వీలుగా సహకారం అందించాలని బ్యాంకర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. సచివాలయం ఐదో బ్లాక్‌లో 235వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. 2026-27 వార్షిక రుణ ప్రణాళికపై బ్యాంకర్లతో చర్చించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ రంగాలకు రూ. 8.10 లక్షల కోట్ల మేర రుణాలను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. - మిగతా3లో



## మేకెదాటు డ్యామ్‌కు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

- మేకెదాటు వద్ద కావేరి నదిపై కర్ణాటక నిర్మిస్తున్న ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తీర్మానం
- ఈ ప్రాజెక్ట్ చట్ట విరుద్ధమన్న సీఎం విజయ్
- ఇటీవల మోదీని కలిసినప్పుడు ఇదే విషయాన్ని ప్రస్తావించిన విజయ్


## అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో కొత్త ట్విస్ట్

- సిమ్యులేటర్ డేటాతో కొత్త అంశాలను బయటపెట్టిన పైలట్లు!
- ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై పైలట్ల సమాఖ్య సంచలన ఆరోపణలు



## అమెరికా-ఇరాన్ చర్చలు వాయిదా..

- ఇటీవల అమెరికా, ఇరాన్ మధ్య చారిత్రక ఒప్పందం
- కొనసాగింపుగా స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన అమెరికా-ఇరాన్ చర్చలు
- ఒప్పందం అమలు, పర్యవేక్షణపై ఈ చర్చలు
- అమెరికా ఉపాధ్యక్షుడి పర్యటన వాయిదా పడినట్టు వైట్‌హౌస్ ప్రకటన
- సాంకేతిక, లాజిస్టిక్ కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడి





# భూసమీకరణ రైతులకు ప్రత్యేక క్యూఆర్ కోడ్

- పారదర్శకంగా కౌలు చెల్లింపు ప్రక్రియ
- రైతులు క్యూఆర్ కోడ్ ద్వారా సులభంగా వివరాలు తెలుసుకునే అవకాశం
- ఫోన్ ద్వారా స్కాన్ చేసి వివరాలు
- ఆఫీసుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఇంటి నుంచే సమాచారం తెలుసుకునేలా ఏర్పాట్లు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాజధాని అమరావతి నిర్మాణానికై భూసమీకరణ కింద భూములు ఇచ్చిన రైతుల సౌకర్యార్థం, ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ కీలక సమాచారాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. రైతులకు అందించే వార్షిక కౌలు చెల్లింపుల స్థితిగతులను పారదర్శకంగా తెలియజేసే ఉద్దేశంతో పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. వార్షిక కౌలు జమ అయిన రైతుల వివరాలతో - మిగతా3లో




## పరీక్షల నిర్వహణలో లోపాలతో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు పరిహారమివ్వాలి

- ప్రధానికి కాక్రోచ్ పార్టీ చీఫ్ లేఖ
- పరీక్షల్లో గందరగోళం కారణంగా విద్యార్థుల బలవన్మరణంపై కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు దీప్కే ఆందోళన
- బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలని ప్రధాని మోదీకి లేఖ
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్?

## రూ. 24 కోట్లతో
# 'అరణ్యారామం'

- భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- ఇక్కడి నుంచే అటవీ శాఖ పరిశోధన, శిక్షణ కార్యకలాపాలు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖల పరిశోధన, శిక్షణ కార్యక్రమాల పర్యవేక్షణ భవనం అరణ్యారామానికి శుక్రవారం మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, అటవీ శాఖ ఉన్నతాధికారులతో కలిసి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భూమి పూజ చేశారు. మంగళగిరిలోని ఎయిమ్స్ సమీపంలో, బ్రహ్మానందపురం వద్ద రూ. 24 కోట్ల అంచనా వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ఈ అరణ్యారామం అటవీ, పర్యావరణ శాఖలకు సంబంధించి పరిశోధనలు, శిక్షణా కార్యక్రలాపాలతోపాటు ప్రకతి, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం - మిగతా3లో

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

## రూ.27.80 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్ 19:**
బంగారుపాళ్యం, పలమనేరు పరిసర ప్రాంతాల్లో వరుస ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను బంగారుపాళ్యం పోలీసులు అరెస్టు చేసి రూ.27.80 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించి బాధితులకు పోగొట్టుకున్న సొత్తును తిరిగి అందించేలా చర్యలు చేపట్టిన పోలీసు బృందాన్ని చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డుడి అభినందించారు. బంగారుపాళ్యం, పలమనేరు ప్రాంతాల్లో వరుస ఇంటి దొంగతనాలు చోటుచేసుకోవడంతో బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పలమనేరు సబ్ డివిజనల్ పోలీసు అధికారి డేగల ప్రభాకర్ సూచనలతో, బంగారుపాళ్యం ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసులు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. దర్యాప్తులో భాగంగా శుక్రవారం బంగారుపాళ్యం-పాలేరు వంతెన సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తూ పారిపోవడానికి ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు తమిళనాడుకు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులని, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో పగటి సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. ప్రధాన నిందితుడు ఆర్.గాడ్విన్ మోసెస్ అలియాస్ గాడిస్ తన సహచరులు ఎస్. మురుగన్, వి. విగ్నేష్ సహకారంతో బంగారుపాళ్యం, పలమనేరు మండలాల్లో పలు ఇంటి దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. నిందితుల ఒప్పుకోలు మేరకు బంగారుపాళ్యం మండలంలోని గౌరీపురం, వెలుతురుచేను, రాగిమానుపెంట గ్రామాలు, పలమనేరు మండలంలోని కరిడీమడుగు, చిన్నకుంట, కాలవపల్లి గ్రామాల్లో జరిగిన ఆరు ఇంటి దొంగతనాల కేసులను పోలీసులు ఛేదించారు. నిందితుల వద్ద నుంచి 181.5 గ్రాముల బంగారు ఆభరణాలు (సుమారు రూ.24 లక్షలు), 307 గ్రాముల వెండి ఆభరణాలు (సుమారు రూ.80 వేల విలువ), దొంగతనాలకు ఉపయోగించిన రూ.2.50 లక్షల విలువైన స్విఫ్ట్ డిజైర్ కారు, రూ.50 వేల విలువైన స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు గాడ్విన్ మోసెస్‌పై తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పలు దొంగతనాల కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన బంగారుపాళ్యం పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లాఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# కుప్పం రెస్కో ఎండీ పగ్గాలు ఎవరికి?

## త్వరలో తేల్చనున్న ప్రభుత్వం

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 19:**
కుప్పం రూరల్ ఎలక్ట్రికల్ కోఆపరేటివ్ సొసైటీ (రెస్కో)లో మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) పదవి ఖాళీ కావడంతో ఆ కీలక బాధ్యతలను ఎవరికి అప్పగించాలనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రస్తుతం ఇంధన శాఖ, రెస్కో పాలకవర్గం సంయుక్తంగా కొత్త ఎండీ నియామకంపై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక గుర్తింపు పొందిన గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ అయిన కుప్పం క్రెక్స్, APSPDCL పరిధిలో స్వయం ప్రతిపత్తితో సేవలు అందిస్తోంది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పదవీ విరమణ అనంతరం ఖాళీ అయిన ఈ పోస్టు భర్తీపై పలు ప్రతిపాదనలను అధికారులు పరిశీలిస్తున్నారు. కొత్త ఎండీగా తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి సీనియర్ అధికారిని డెప్యుటేషన్‌పై నియమిస్తారా, లేక సంస్థలోనే దశాబ్దాలుగా పనిచేస్తూ స్థానిక పరిస్థితులు, వినియోగదారుల అవసరాలపై పూర్తి అవగాహన కలిగిన సీనియర్ అధికారికి బాధ్యతలు అప్పగిస్తారా అనే అంశాలపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. సంస్థ అభివృద్ధి, విద్యుత్ సేవల నాణ్యత మెరుగుదల,వినియోగదారులకు వేగవంతమైన సేవల అందుబాటు, సాంకేతిక ఆధునికీకరణ వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని అనుభవం, పరిపాలనా సామర్థ్యం, సాంకే తిక నైపుణ్యం కలిగిన అధికారిని ఎంపిక చేయాలనే ఆలోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, వారం నుంచి పదిరోజుల్లోగా ఈ నియామకంపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చే అవకాశముందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. స్థానిక వినియోగదారులు కూడా ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకుని సమర్థుడైన అధికారిని నియమిస్తే రెస్కో సేవలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొత్త ఎండీ నియామకం సంస్థ భవిష్యత్తు పనితీరుపై ప్రభావం చూపే కీలక నిర్ణయంగా మారనున్న నేపథ్యంలో అందరి దృష్టి ప్రభుత్వ నిర్ణయంపైనే నిలిచింది.

# రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నిధులు

## బైరెడ్డిపల్లిలో ప్రారంభోత్సవ కార్యక్రమానికి

# రైతులు హాజరుకావాలి

**వి.కోట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్ 19:**
కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం నాలుగో విడత నిధులను శనివారం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పలమనేరు నియోజకవర్గ స్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బైరెడ్డిపల్లి మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయనున్న కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎన్.నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ టెలివిజన్ ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు శ్రీరామచంద్ర నాయుడు, ఏపీ స్టేట్ వేర్‌హౌసింగ్ డైరెక్టర్ ఏ.ఎం. రంగనాథ్, మండల టీడీపీ అధ్యక్షుడు బి.ఆర్. రాంబాబు, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ వెల్లడించారు. పలమనేరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన రైతులు, ప్రజా ప్రతినిధులు,కూటమి నాయకులు శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు బైరెడ్డిపల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఆర్థికంగా ఊరట లభిస్తుందని తెలిపారు.

చదవండి.. చదివించండి
చిత్తూరు ఎక్స్‌ప్రెస్

# మామిడి రైతులకు కిలోకి రూ 4 ప్రకటించడం హర్షణీయం

## గుజ్జు ఫ్యాక్టరీల ధరలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి: మామిడి రైతు సంఘం



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్ 20:**
తోతాపురి మామిడి రైతులకు కిలోకు రూ.4 ప్రోత్సాహకాన్ని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతు సంఘం స్వాగతించింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మునీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధులు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మునీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.., ఈ నెల 12న తిరుపతి పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి ఎన్. నారా చంద్రబాబు నాయుడును, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యప్రసాద్‌ను కలిసి మామిడి రైతుల సమస్యలను వివరించామని తెలిపారు. జిల్లాలో తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్న రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. మామిడి రైతు సంఘం వినతిని పరిశీలించిన అనంతరం అధికారులతో చర్చించి రైతులను ఆదుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, ఆ హామీ మేరకు కిలోకు రూ.4 ప్రోత్సాహకాన్ని ప్రకటించడం హర్షణీయమని పేర్కొన్నారు. అయితే గత ఏడాది ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకానికి అనుగుణంగా గుజ్జు ఫ్యాక్టరీలు కిలోకు రూ.8 చెల్లించలేదని, నిబంధనలు ఉల్లంఘించిన ఫ్యాక్టరీలపై చర్యలు కూడా తీసుకోలేదని ఆరోపించారు. ఈ ఏడాది ప్రభుత్వం ప్రకటించిన రూ.4తో పాటు గుజ్జు ఫ్యాక్టరీల నుంచి రైతు సంఘం డిమాండ్ చేస్తున్న రూ.14 కలిపి మొత్తం రూ.18 చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది గుజ్జు ఫ్యాక్టరీలు, ర్యాంపులు ఏ ధరకు మామిడికాయలు కొనుగోలు చేస్తున్నాయో ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని కోరారు. ఇప్పటికే 50 నుంచి 60 శాతం వరకు తోతాపురి మామిడికాయలు గుజ్జు ఫ్యాక్టరీలు, ర్యాంపులకు సరఫరా చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకం రైతులకు అందించే విషయంలో రైతుల వివరాల కోసం గుజ్జు ఫ్యాక్టరీలు, ర్యాంపులపై ఆధారపడాల్సి వస్తోందని, నిజమైన రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత నెల రోజులుగా రైతులు టోకెన్ల కోసం గుజ్జు ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ప్రజాప్రతినిధులు స్పందించలేదని విమర్శించారు. రైతు సంఘం పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని ప్రకటించిందని, అనంతరం సంబరాల్లో పాల్గొనడం బాధాకరమని వ్యాఖ్యానించారు. అలాగే ఉపాధి హామీ పథకాన్ని మామిడి సాగుతో అనుసంధానం చేసి కూలీల ఖర్చులను తగ్గించడం ద్వారా రైతుల నష్టాన్ని కొంత వరకు తగ్గించే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు హేమలత, త్యాగరాజ రెడ్డి, చంగల్రాయ రెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వేసవిబడి విద్యార్థులకు 19 ఏళ్లుగా యోగా శిక్షణా తరగతులు.





**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 19:**
అంతర్జాతీయ యోగదినోత్సవము ప్రతి యేడాది జూన్ 21 న జరుపుకొంటున్న శుభ సందర్భంగా యావన్మందికీ ముందుస్తు అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుచున్నామని స్థానిక మునిసిపాలిటీ పరిధిలోని త్యాగరాజనగర్ లో గల మార్గదర్శి విద్యానికేతన్‌లో నిర్వహిస్తున్న ఉచిత వేసవిబడి నిర్వాహుకులు కె.సాయికళ - కె. మాళప్ప దంపతులు పేర్కొన్నారు. యోగ ప్రాముఖ్యత గురించి ఉచిత వేసవిబడిలో చదివిన విద్యార్థులకు 19 యేళ్ల క్రితమే యోగ శిక్షకుల ద్వారా శిక్షణ ఇస్తూ విద్యార్థులకు ఆరోగ్యపరంగా మానసిక ఉల్లాసముగా శిక్షణా తరగతులు నిర్వహించడం ఇప్పటికీ జరుగుతోందని గురువారం వారొక ప్రకటన విడుదల చేశారు. యోగ అనేది శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక - ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమైనది. ఇది ఒత్తిడిని తగ్గించడానికి, ఏకాగ్రతను పెంచడానికి మరియు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడానికి సహాయపడుతుంది. యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు, ఇది ఒక జీవన విధానం. శారీరక దృఢత్వమునకు యోగాసనాలు ఎంతగనో ఉపయోగపడుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ చీఫ్ శ్రీశ్రీశ్రీ రవి శంకర్ గురూజీ శిష్య బృందం మాస్టర్ బైరాపురం శ్రీనివాసరెడ్డి, పట్టణంలోని నళినాక్షి, సుబ్రమణ్యం,ఆనంద్, నాగిరెడ్డి, రియాజ్ తదితర పేర్కొన్నారు. యోగా శిక్షకుల ద్వారా ఉచిత వేసవిబడి విద్యార్థులకు ప్రతి యేడాది యోగ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతున్నాయని యోగా మాస్టర్లు శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ నెల 21న ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్న శుభవేళ ఉచిత వేసవిబడిలో శిక్షణ పొందిన పూర్వ విద్యార్థులకు ఇదొక శుభ పరిణామంగా భావిస్తున్నామన్నారు. ఇటువంటి యోగా తరగతులు మునుముందు కూడా ఉచిత వేసవిబడి విద్యార్థులకు శిక్షణ నిర్వహించడం జరుగుతుందని ఈ శుభ సందర్భంగా తెలియజేస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగు యోగ శిక్షణ కార్యక్రమములు దిగ్విజయం కావాలని మార్గదర్శి విద్యానికేతన్ ఉచిత వేసవిబడి నిర్వాహకులు కె.సాయికళ - కె . మాళప్ప దంపతులు ఆకాంక్షించారు.

# నీట్ పునఃపరీక్షకు పటిష్ట భద్రత

## మూడు పరీక్షా కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు.. జిల్లా ఎస్పీ తుషార్ డుడి



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్ 19:**
జాతీయ పరీక్షల సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించనున్న నీట్ (యూజీ)-2026 పునఃపరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డుడి తెలిపారు. జిల్లాలోని పీవీకేఎన్ డిగ్రీ కళాశాల, సావిత్రమ్మ కళాశాల, లిటిల్ ఫ్లవర్ కళాశాలల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లను సమన్వయం తో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక డీఎస్పీ స్థాయి అధికారిని నియమించడంతో పాటు ఇద్దరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఐదుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లు సహా మొత్తం 50 మంది పోలీసు సిబ్బందిని విధుల్లో నియమించినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసు కోకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకునేలా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టామని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తల్లిదండ్రులు, బంధువులు అధిక సంఖ్యలో గుమికూడకుండా సహకరించాలని కోరారు. పరీక్షల నిర్వహణకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లలో పేర్కొన్న సూచనలు, నియమ నిబంధనలను పూర్తిగా చదివి పాటించాలని, అనుమతించిన వస్తువులను మాత్రమే వెంట తీసుకురావాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద అనుమానాస్పద పరిస్థితులు లేదా అవాంఛనీయ సంఘటనలు గమనించిన వెంటనే డయల్-112 లేదా సమీప పోలీసు అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన ఈ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించడం అందరి బాధ్యత అని, విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా పరీక్షలపై దృష్టి సారించాలని ఎస్పీ తెలిపారు.

# పుస్తకాల పేరుతో దోపిడీ చేస్తున్న శ్రీ చైతన్య బుక్స్ రూమ్ సీజ్



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్19:**
శ్రీకాళహస్తి పట్టణంలో చైతన్య విద్యాసంస్థలు పుస్తకాల పేరుతో విచ్చల విడిగా వేల రూపాయలకు ప్రైవేట్ అదె రూమ్ నందు అమ్ముతుండగా శుక్రవారం శ్రీకాళహస్తి పి.డి.ఎస్.యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో అడ్డుకొని సీజ్ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు ఎస్ జాకీర్ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించి మండల విద్యాశాఖ అధికారి బాలయ్య నీ రప్పించి పాఠశాలపుస్తకాల గదిని సీజ్ చేయించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థల్లో పాఠ్యపుస్తకాలు అమ్మకూడదని ఉత్తర్వులు జారీ చేసిన అధికారమనే మదంతో చదువును అడ్డుపెట్టుకొని పుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వేల, లక్షల రూపాయలు వసూలు చేస్తూ్న శ్రీ చైతన్య విద్యా సంస్థలు వ్యాపారం చేసుకోవడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా శ్రీకాళహస్తి పట్టణంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు కూడా వ్యాపారం చేస్తున్నారు. వాటిని కూడా అడ్డుకొని తీర్థం అన్నారు. ఎటువంటి సదుపాయాలు లేకున్నా మా వద్ద అన్ని ఉన్నవి అని తల్లిదండ్రులను బురిడీ కొట్టించి ఒక్కొక్క విద్యార్థికి వేల రూపాయలు వసూలు చేయడం దుర్మార్గమని. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి , జిల్లా విద్యాశాఖ అధికారులు విద్యాసంస్థలకు అమ్ముడుపోయే విధంగా వ్యవహరించడం సరికాదు అన్నారు. ఇదే విధంగా ఉంటే రాబోవు రోజులలో పేద, మధ్య తరగతి, బడుగు బలహీన వర్గాల నుండి వచ్చేటువంటి విద్యార్థులు చదువుకు దూరం అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టం తేవాలని ఫీజుల పేరుతో పీడించే శ్రీ చైతన్య మరియు ప్రైవేట్ విద్యాసంస్థల పై వెంటనే చర్యలు తీసుకోవాలని గుర్తింపు లేని విద్యాసంస్థలను కూడా రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నాయకులు ఎల్.శివ, ఇజ్వాన్, షకీల్. తదితర నాయకులు పాల్గొన్నారు.

# కాకినాడ పామాయిల్ తోటలో మిస్టరీ!

## రెండేళ్ల జ్ఞానేశ్వరి ఏమైంది? ఆ 35 నిమిషాల్లో ఏం జరిగింది?

**కాకినాడ :** నిశ్శబ్దంగా ఉన్న ఆ పామాయిల్ తోటలు ఇప్పుడు ఒక తీరని వేదనను, అంతుచిక్కని మిస్టరీకి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. కన్నవారి కళ్ల ముందే ఆడుకుంటూ కనిపించకుండా పోయిన రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి ఉదంతం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. కేవలం 35 నిమిషాల గ్యాప్‌లో ఆ పసిపాప ఎటు వెళ్లింది. ప్రాణ స్నేహితుడిలా వెంట వెళ్లిన పెంపుడు కుక్క మౌనంగా తిరిగి వచ్చి ప్రాణాలు ఎందుకు వదిలింది? అనే ప్రశ్నలకు సమాధానాలు చిక్కడం లేదు. కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్. అగ్రహారంలో జూన్ 6న మొదలైన ఈ అన్వేషణ... నేటికి ఓ కొలిక్కి రావడం లేదు. డ్రోన్లు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, వందలాది మంది పోలీసులు రంగంలోకి దిగినా ఫలితం శూన్యం. ఈ క్రమంలో పోలీసులు చేస్తున్న ఒక వింత ప్రయోగం ఇప్పుడు అందర్నీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. పాపను అడవి జంతువులు ఏమైనా తీసుకెళ్లాయా అనే కోణంలో మాంసం నింపిన బొమ్మలతో ఆపరేషన్ మొదలు పెట్టారు. జూన్ 6వ తేదీన తల్లిదండ్రులు గణేష్, భవానితో కలిసి పామాయిల్ తోటకు వెళ్లింది చిన్నారి జ్ఞానేశ్వరి. తల్లిదండ్రుల మధ్య జరిగిన సమన్వయలోపం కారణంగా ఆ పసిపాప ఒంటరిగా మిగిలిపోయింది. పోలీసులు నిర్ధారించిన దాని ప్రకారం సరిగ్గా 35 నిమిషాల వ్యవధిలో బాలిక మాయమైంది. సమాచారం అందిన వెంటనే యంత్రాంగం అలెర్ట్ అయినప్పటికీ, ఆ దట్టమైన తోటల్లో పాప ఆచూకీ దొరకలేదు. ఈ కేసులో అత్యంత విషాదకరమైన, మిస్టరీగా మారిన అంశం వారి పెంపుడు కుక్క. పాపా వెంట వెళ్లిన ఈ కుక్క జూన్ 9న ఒంటరిగానే ఇంటికి చేరింది. ఇంటికి వచ్చినప్పటి నుంచి ఆహారం తీసుకోకుండా వింతగా ప్రవర్తించింది. దీనికి జీపీఎస్ ట్రాకర్ అమర్చి పాపా ఎక్కడ ఉందో కనుగొనే ప్రయత్నం చేసినా



ఫలితం దక్కలేదు. సుమారు 80 కిలోమీటర్లు ఆ తోటల చుట్టూ తిరిగి ఆ కుక్క, చివరకు జూన్ 13న మరణించింది. వైరల్ ఇన్ఫెక్షన్ లేదా నాలుగు రోజులు ఆహారం లేకపోవడం వల్ల అది చనిపోయి ఉంటుందని భావించారు. పాపను అడవి జంతువులు ఏమైనా ఎత్తుకెళ్లాయా అన్న అనుమానంతో అధికారులు ఒక షాకింగ్ ఆపరేషన్ చేపట్టారు. తోటలో ఒక ఇనుప బోను ఏర్పాటు చేసి అందులో చిన్నారిని పోలిన రెండు బొమ్మలను ఉంచారు. ఆ బొమ్మల లోపల మాంసం ముక్కలను నింపి, జంతువులను ఆకర్షించేలా ప్లాన్ చేశారు. దీనికి తోడు చుట్టూ కెమెరా ట్రాప్లను పెట్టారు. వన్యమృగాల కదలికలను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎన్డీర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతోపాటు అధునాతన డ్రోన్లతో తోటలను జల్లెడ పడుతున్నారు. అడవితోపాటు సమీపంలోని సంచార జాతుల పైన కూడా పోలీసులు నిఘా పెట్టారు. డీఎస్పీ తిలక్ స్వయంగా ఈ ఆపరేషన్ పర్యవేక్షిస్తున్నారు. చిన్నారి ఆచూకీ తెలిపిన వారికి జిల్లా యంత్రాంగం లక్ష రూపాయల రివార్డు ప్రకటించింది. ఇదే సమయంలో సోషల్ మీడియాలో వస్తున్న నెగెటివ్ వార్తలపై పోలీసులు సీరియస్ అయ్యారు. అవాస్తవాలు ప్రచారం చేస్తే లీగల్‌గా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కాపు నేతల్లో కాక...

**రాజమండ్రి :** రాజకీయాల్లో కొంతమంది పనితీరుతో రాణిస్తారు. మరికొొందరు సెంటిమెంట్ రాజకీయాలు నడిపి రాణిస్తారు. రెండో కోణంలో రాణించారు జగన్మోహన్ రెడ్డి. వైయస్ రాజశేఖర్ రెడ్డి పై ఉన్న ప్రజాభిమానాన్ని తాను పొందగలిగారు. తండ్రి మాదిరిగా సంక్షేమ పథకాలు అందించి ప్రజల మనసు గెలవాలని చూసారు. కానీ ప్రజలు మాత్రం జగన్మోహన్ రెడ్డిలో రాజశేఖర్ రెడ్డిని చూసుకోలేదు. మహానేత కుమారుడిగా ఒక్కసారి మాత్రమే ఛాన్స్ ఇచ్చారు. రెండోసారి మాత్రం చాన్స్ ఇవ్వలేదు. అయితే రాజశేఖర్ రెడ్డి చేయలేనంతగా.. కులాలను, వర్గాలను విడదీసి వారి అభిమానాన్ని పొందాలనుకున్నారు జగన్మోహన్ రెడ్డి. కానీ ఒక్కసారి మాత్రమే అందులో కూడా సక్సెస్ అయ్యారు. రెండోసారి విఫలమయ్యారు.ఏపీలో ఎవరు అధికారంలోకి రావాలన్నా ప్రధాన సామాజిక వర్గంగా ఉన్న కాపులు మద్దతు ఉండాల్సిందే. అయితే ఆ కాపులను 2019 ఎన్నికల్లో టర్న్ చేసుకోవడంలో సక్సెస్ అయ్యారు జగన్మోహన్ రెడ్డి. కాపు రిజర్వేషన్ ఉద్యమం ద్వారా భారీగా లబ్ధి పొందారు. ఇప్పుడు కూడా అటువంటి వ్యూహాలకు పదును పెడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయానికి కాపులే కారణమని జగన్మోహన్ రెడ్డి గుర్తించారు. అందుకే వారిలో చీలిక తేవాలని చూస్తున్నారు. కాపుల వేళ్ళతో కాపులను పొడిచే సరికొత్త ప్రయోగం చేస్తున్నారు. కాపు ఓటు బ్యాంకు ను చీల్చడమే కూటమిని దెబ్బతీసే ఏకైక మార్గం అని బలంగా నమ్ముతున్నారు. గత ఎన్నికల్లో కాపులు ఆదరించని వైసీపీ కాపు నేతలు చాలామంది ఉన్నారు. వారిని ముందు పెట్టి ఇప్పుడు రాజకీయ క్రీడ మొదలుపెట్టారు.ఒక అంబటి రాంబాబు, పేర్ని నాని, తోట త్రిమూర్తులు, గుడివాడ అమర్నాథ్, కన్నబాబు, బొత్స సత్యనారాయణ.. ఇలాంటి వైసీపీ కాపు నేతలను ముందు పెట్టి కాపుల విషయంలో బలమైన ప్రచారానికి జగన్ స్క్రిప్ట్ సిద్ధం చేశారు. పవన్ కళ్యాణ్ రూపంలో కూటమిలో డిప్యూటీ సీఎం పదవి ఉన్న కాపులకు ఎటువంటి ప్రయోజనం లేదని ప్రచారం



మొదలుపెట్టారు. కాపు సామాజిక వర్గానికి ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత ఇవ్వడం లేదని.. చంద్రబాబు ప్రయోజనాల కోసమే పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని కోణంలో వ్యతిరేకతను నూరి పోయాలని చూస్తున్నారు. పవన్ కళ్యాణ్ పై కాపు యువతలో, ఓటర్లలో అసంతృప్తిని పెంచగలిగితే.. ఆ ఓట్లు ఆటోమేటిక్గా తమ వైపు టర్న్ అవుతాయన్నది జగన్ ఆలోచన.అయితే జగన్మోహన్ రెడ్డి కాపు సామాజిక వర్గ ఆలోచనను తక్కువగా అంచనా వేస్తున్నారన్న విశ్లేషణ ఉంది. ఎందుకంటే 2014 నుంచి 2019 మధ్య కాపుల విషయంలో జగన్ అనుసరించిన వైఖరి తెలియంది కాదు. ముఖ్యంగా చంద్రబాబు సర్కార్ ఇచ్చిన ప్రయోజనాలను సైతం రద్దుచేసి కాపులను ఒక ఓటు అస్త్రంగా మార్చుకున్న వైనాన్ని ఇప్పటికీ గుర్తు చేసుకున్నారు. పైగా ఇదే వైసిపి కాపు నేతలు కాపు సామాజిక వర్గం విషయంలో చేసిన ప్రకటనలు కూడా గుర్తున్నాయి కాపు సామాజిక వర్గానికి. తమ కళ్ళను తమ చేతితో పొడుచుకునేందుకు కాపులు సిద్ధంగా లేరు. తప్పకుండా జగన్ ప్రయత్నం వికటిస్తుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# అనంతకు భారీగా పరిశ్రమలు

**అనంతపురం :** ఏపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పెట్టుబడులపై ఫోకస్ పెట్టింది. అది కూడా ఒక్క జిల్లాకు పరిమితం కాకుండా.. జిల్లాల వారీగా ఓ ప్లాన్ ప్రకారం పరిశ్రమలు, కంపెనీలను తీసుకొస్తోంది. ఇటీవల కాలంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు పరిశ్రమలు క్యూ కట్టాయి. పుట్టపర్తి, హిందూపురంతో పాటుగా అనంతపురం ప్రాంతాలకు భారీగా పెట్టుబడులు వచ్చాయి. పొరుగునే ఉన్న కర్ణాటకను కాదని ఏపీకి కంపెనీలు ఎందుకు వస్తున్నాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలు లేకుండా అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికల్ని అమలు చేస్తోంది. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో అక్కడి పరిస్థితులకు అనుకూలంగా పరిశ్రమలు, కంపెనీలను తీసుకొస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాకు ఐటీ కంపెనీలు, డేటా సెంటర్లు, ఫార్మా పరిశ్రమలు వస్తున్నాయి. కోస్తా జిల్లాలలో సోలార్ ప్లాంట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఇతర పరిశ్రమలు, పర్యాటక రంగ అనుబంధ హోటల్స్, పోర్టుల్ని అభివృద్ధి చేస్తున్నారు. రాయలసీమ జిల్లాల్లో సోలార్ ప్లాంట్‌లు, డ్రోన్ సిటీ, డ్రోన్, ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు, సెమీ కండక్టర్ పరిశ్రమల్ని తీసుకొస్తున్నారు. ముఖ్యంగా రాయలసీమలో కరువు జిల్లాగా పిలిచే ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఇప్పటికే ఆటోమొబైల్, టెక్స్‌టైల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు రాగా.. కొంతకాలంగా ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు వస్తున్నాయి. పొరుగునే ఉన్న కర్ణాటకను కాదని పుట్టపర్తి, హిందూపురం సహా పలు కీలక ప్రాంతాలకు పరిశ్రమలు వస్తున్నాయి.కర్ణాటకను కాదని ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఎన్నో అనుకూల అంశాలు ఉన్నాయి. ప్రధానంగా ఉమ్మడి అనంతపురం జిల్లా కర్ణాటకకు సరిహద్దులో ఉంది.. అక్కడితో పోలిస్తే అనంతపురం జిల్లాలో భూముల లభ్యత బావుంది. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇండస్ట్రియల్ పాలసీతో పాటు అందిస్తున్న ప్రోత్సాహకాలు కూడా కలిసొస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను వేగంగా ఇవ్వడం ప్లస్ పాయింట్. బెంగళూరు ఎయిర్‌పోర్ట్ అనంతపురం జిల్లా సరిహద్దు నుంచి దగ్గరగా ఉంది.. కేవలం రెండు, మూడు గంటలు ప్రయాణం ఉంటుంది. బెంగళూరు ఎయిర్‌పోర్ట్ నుంచి హిందూపురం, పుట్టపర్తి జస్ట్ 2 గంటల్లో చేరుకోవచ్చు. అంతేకాదు పుట్టపర్తిలో ఎయిర్‌పోర్ట్ ఉండటం కూడా కలిసొస్తుంది.. ఇటు రోడ్డు, రైలు సౌకర్యాలు ఉండటం సానుకూలంగా మారింది. అందుకే పారిశ్రామికవేత్తలు పొరుగునే ఉన్న కర్ణాటక కాకుండా సమీపంలోనే ఉన్న అనంతపురం జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారని చెబుతున్నారు.ఏపీ ప్రభుత్వం ముందుగానే ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూముల్ని గుర్తించి పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తోంది. అందుకే పారిశ్రామికవేత్తలు అనంతపురం జిల్లావైపు మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిశ్రమల కోసం వేల ఎకరాల ప్రభుత్వ, బంజరు భూముల్ని గుర్తించారు. పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వం లేపాక్షి, మడకశిర పరిసరాల్లో వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేసింది. కర్ణాటకతో పోలిస్తే ఇక్కడ భూముల ధరలు చాలా తక్కువ కావడంతో అనంతపురం జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. గతేడాది బెంగళూరులో ఉన్న ఐటీ కంపెనీ సీఈవో కష్టాలు చెప్పుకుంటూ ట్వీట్ చేశారు. మంత్రి లోకేష్ వెంటనే స్పందించి.. ఏపీకి రమ్మని ఆహ్వానించారు. ఆ తర్వాత మంత్రి లోకేష్ అనంతపురాన్ని కొత్త ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా పేర్కొన్నారు. ఏరోస్పేస్, ఇతర పరిశ్రమలకు ఏపీలో 8వేల ఎకరాల భూమి అందుబాటులో ఉందంటూ ఆహ్వానం పలికారు. లోకేష్ ఇచ్చిన పిలుపు కూడా పరిశ్రమల రాకకు ఓ కారణంగా చెప్పొచ్చు.ఇప్పటికే ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలు.. సోలార్, డ్రోన్ పరిశ్రమలు రాగా.. ఇటీవల కేంద్రం నుంచి వచ్చిన యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు ఈ ప్రాంతానికి మరింత బూస్టప్ ఇచ్చింది. ఏపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాను ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా తయారు చేయాలని ప్లాన్ చేస్తోంది.. రాబోయే రోజుల్లో మరికొన్ని పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. గతంలో ఉద్యోగాలు, ఉపాధి కోసం బెంగళూరు, కర్ణాటక వెళ్లిన జిల్లా ప్రజలకు.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసిన పరిశ్రమలు, కంపెనీలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. తాజాగా జిల్లాకు వరుసగా పరిశ్రమల రాకతో మరికొన్ని ఉద్యోగ, ఉపాది అవకాశాలు దక్కుతాయంటున్నారు. ఇక జిల్లావాసులు ఉద్యోగం, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదంటున్నారు.ఉమ్మడి అనంతపురం జిల్లా భారీ పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. పెనుకొండలో కియా మోటార్స్ కార్ల తయారీ ప్లాంట్ ఉంది. కియాకు అనుబంధంగా మరికొన్ని అంతర్జాతీయ విడిభాగాలు (స్పేర్ పార్ట్స్) కంపెనీలు ఏర్పాటయ్యాయి. రాప్తాడు దగ్గర రేమండ్ గ్రూప్ రూ. 1,200 కోట్ల పెట్టుబడితో ప్లాంట్లు ఏర్పాటు చేయబోతోంది.

## ఆర్థిక కార్యకలాపాలు మరింత పుంజుకునేలా బ్యాంకర్లు సహకరించాలి

-మొదటిపేజీ తరువాయి

డిజిటల్ ఆర్థిక నేరాల నియంత్రణ దిశగా బ్యాంకులు చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు. డిజిటల్ అరెస్టులు, ఇతర సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ఓ ప్రత్యేక ఎస్ఓపీ ని రూపొందించాలని సూచించారు.

**రుణ ప్రణాళిక**

వ్యవసాయం సహా ప్రాధాన్యతా రంగాలకు రూ.5.4 లక్షల కోట్లు, ఇతర రంగాలకు రూ.2.70 లక్షల కోట్లు ఇవ్వాలని ప్రణాళిక చేశారు. ప్రత్యేకించి వ్యవసాయ రంగానికి రూ.3.60 లక్షల కోట్లు, పంట రుణాల కింద రూ.2 లక్షల కోట్లు ఇవ్వాలని బ్యాంకులు నిర్ణయించాయి. వ్యవసాయ యాంత్రీకరణ రూ.10,693 కోట్ల మేర ఆర్థిక సహకారం అందించాలని రుణ ప్రణాళికలో ఖరారు చేశారు. ఎంఎస్ఎంఈ రంగానికి రూ. 1.55 లక్షల కోట్లు, మైక్రో ఎంటర్ ప్రైజెస్ కోసం రూ.70 వేల కోట్లు, గృహ నిర్మాణానికి రూ.11,500 కోట్లు, విద్యా రుణాలకు రూ.2,500 కోట్లు కేటాయిస్తున్నట్లు రుణ ప్రణాళికలో వెల్లడించాయి.

**ఏపీలో 137 శాతం మేర రుణ వితరణ**

2025-26లో వ్యవసాయ రంగానికి రూ. 3 లక్షల 86 వేల 249 కోట్ల రుణం ఇచ్చినట్లు బ్యాంకర్లు వివరించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ. లక్షా 17 వేల 357 కోట్లు, ప్రాధాన్యతా రంగానికి రూ. 5 లక్షల 19 వేల 693 కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో రుణ వితరణ 137 శాతం మేర ఉన్నట్టు బ్యాంకర్లు సీఎం చంద్రబాబుకు వివరించారు.

## భూసమీకరణ రైతులకు ప్రత్యేక క్యూఆర్ కోడ్

-మొదటిపేజీ తరువాయి

పాటు, ఇంకా కౌలు జమ కాని వారి వివరాలు, చెల్లింపులు నిలిచిపోవడానికి గల కారణాలను కూడా ఇందులో వెల్లడించారు. నేరుగా బ్యాంకుకే: ఎన్‌పీసీఐ వ్యవస్థలో ఇనాక్టివ్‌గా ఉన్న బ్యాంకు ఖాతాలను కలిగిన రైతుల జాబితాను సైతం అందుబాటులో ఉంచారు. రాజధాని రైతులకు కౌలు చెల్లింపులు నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్న నేపథ్యంలో, ఎన్?పీసీఐ లింకేజీ సక్రమంగా లేకపోవడం లేదా బ్యాంకు ఖాతాలు ఇనాక్టివ్‌గా ఉండటం వంటి కారణాల వల్ల కొందరి ఖాతాలకు డబ్బు జమ కావడం లేదు. అలాంటి రైతులు తమ ఖాతా ఉన్న బ్యాంకును సంప్రదించి ఖాతాలను యాక్టివ్ చేసుకోవాలని ఏపీసీఆర్?డీఏ తరపున సూచించారు. రైతులు తమ వార్షిక కౌలు చెల్లింపు స్థితిని సులభంగా తెలుసుకునేందుకు ఏపీసీఆర్డీఏ నుంచి క్యూఆర్? కోడ్‌ను విడుదల చేశారు.
ఆ ఖాతాలను యాక్టివేట్ చేసుకోవాలి: ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే సంబంధిత వెబ్‌పేజీలో రాజధాని రైతులు తమ వివరాలను చెక్ చేసుకోవచ్చని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. దీంతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్ద నుంచే కౌలు లబ్ధి సమాచారం తెలుసుకునే సౌకర్యం కల్పించారు. కౌలు లబ్ధి పొందని రైతులు తమ పేర్లు, ఖాతా వివరాలు ఏ కారణం చేత కౌలు జమ కాలేదోనన్న అంశాలను సైతం చెక్ చేసుకోవచ్చునని అధికారులు తెలుపుతున్నారు. ఆధార్ ఇనాక్టివ్‌గా ఉన్న బ్యాంక్ ఖాతాలలో కౌలు నగదు జమ చేయడం సాధ్యపడదు కనుక ఆధార్ ఇనాక్టివ్‌గా ఉన్న బ్యాంకు ఖాతాలు కలిగిన రైతులు వెంటనే ఆ ఖాతాలను యాక్టివేట్ చేసుకోవాలని సూచించారు.

## రూ. 24 కోట్లతో 'అరణ్యారామం'

-మొదటిపేజీ తరువాయి

చేపడుతున్న కార్యక్రమాలన్నింటినీ ఒకే వేదిక నుంచి సమన్వయం చేసే కామన్ ఫెసిలిటీ సెంటర్ గా సేవలు అందించనుంది. రాష్ట్ర అటవీ పరిశోధన, శిక్షణ కార్యక్రమాలకు అరణ్యారామం వేదిక కానుంది. కార్యకలాపాలకు కమాండ్ సెంటర్‌గా, ఆంధ్రప్రదేశ్ గ్రేట్ గ్రీన్ వాల్ కార్యక్రమానికి పర్యవేక్షణ కేంద్రంగా, పులుల సంరక్షణ, అటవీ అగ్నిప్రమాదాల నివారణ, జీవావరణ పునరుద్ధరణ, వాతావరణ స్థిరత్వం, ఎకో--టూరిజం అభివద్ధి, డిజిటల్ పర్యావరణ పరిపాలన తదితర విభాగాలకు సమన్వయ కేంద్రంగా సేవలు అందించనుంది. అధునాతన సాంకేతికత సాయంతో ప్రకతి పరిరక్షణ ధ్యేయంగా అరణ్యారామంలో శాస్త్రీయ పరిశోధనలు జరపనున్నారు. క్షేత్ర స్థాయిలో అమలు చేసే కార్యకలాపాలన్నింటినీ ఒకే చోటు నుంచి పర్యవేక్షించే పరిపాలనా కేంద్రంగా నిలవనుంది. శంకుస్థాపన అనంతరం అరణ్యారామం భవన నమూనా, నిర్మిస్తున్న ప్రదేశానికి సంబంధించిన వివరాలను పవన్ కళ్యాణ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, అటవీ శాఖ పీసీసీఎఫ్ పి వి చలపతి రావు, రాష్ట్ర మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, పీసీబీ ఛైర్మన్ డాక్టర్ పి కష్ణయ్య, బయో డైవర్సిటీ బోర్డ్ చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్, రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ మెంబర్ సెక్రటరీ కె శరత్ కుమార్, అటవీశాఖ ఐటీ సలహాదారు పి.నాగబాబు, అటవీ శాఖ ఉన్నతాధికారులు రేవతి, రాహుల్ పాండే, గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఎస్పీ వకుళ్ జిందాల్, ఇతర అటవీశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏపీలో వంద శాతం సినిమా షూటింగ్ చేస్తే భారీ సబ్సిడీ

-మొదటిపేజీ తరువాయి

వెల్లడించారు. దేశీయ పర్యాటకంలో 17 శాతం వృద్ధి.. 13వ స్థానానికి చేరిన ఆంధ్రప్రదేశ్. సాంస్కృతిక రంగానికి పూర్వవైభవం -- 'ఆరెంజ్ ఎకానమీ'తో ఏపీ బ్రాండింగ్. ప్రతి జిల్లాకు ఒక




మ్యూజిక్ కాలేజ్.. కళాకారుల పెన్షన్ల పునరుద్ధరణకు చర్యలు. చలనచిత్ర రంగానికి ఊతం -- గతంలో ప్రకటించిన వాటితో పాటు 2025 నుండి మళ్లీ 'నంది అవార్డులు' ప్రదానం. ఈ ఏడాది నవంబర్ -- డిసెంబర్‌లలో నంది నాటకోత్సవాలు. 2027లో గోదావరి, 2028లో కృష్ణా పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం, నూతన పర్యాటక పాలసీ 2024--29 విడుదల నుంచి 117 ప్రముఖ సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకొని దాదాపు రూ.20,000 కోట్ల భారీ పెట్టుబడుల ఆకర్షణ వరకు, జాతీయ స్థాయి అవార్డుల నుంచి ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అమలైతే 1,22,637 మందికి ప్రత్యక్ష,పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 4,390 హోటల్ గదులకు అదనంగా మరో 9,042 గదులు అందుబాటులోకి వచ్చేలా 50 కొత్త హోటళ్లకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. అందులో భాగంగా నిర్మాణ దశలో ఉన్న 42 హోటళ్ల ద్వారా 48,168 ఉద్యోగాలు లభిస్తాయన్నారు. పీపీపీ విధానంలో పర్యాటకాభివద్ధి చేస్తున్నామని, అధికారుల సమిష్టి కషితో ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 50 వేల గదులు ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆల్ ఇండియా టూర్ ఆపరేటర్స్ అసోసియేషన్ అంతర్జాతీయ స్థాయి సమావేశాన్ని ఈ ఏడాది సెప్టెంబర్ 11, 12 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్నారని, ఇప్పటికే వారితో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. రాష్ట్రంలో ఫిల్మ్ ఇన్ స్టిట్యూట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్న మంత్రి దుర్గేష్ 100 శాతం ఏపీలో షూటింగ్ లు జరుపుకునే చిత్రాలను గుర్తించి సంవత్సరానికి 15 చిత్రాలకు 10 లక్షల చొప్పున నగదు సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, టూరిజం ఇంచార్జ్ ఎండీ పద్మావతి, ఈడీ శేషగిరి రావు, శిల్పారామం సీఈవో స్వామినాయుడు, సాంస్కతిక శాఖ డైరెక్టర్ రేగుళ్ల మల్లిఖార్జున రావు, ఎఫ్ డీసీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐదవ సెమిస్టర్ ఫలితాల్లో సత్తా చాటిన

# కుప్పం డిగ్రీకళాశాల విద్యార్థులు




**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 19:**
శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. వివిధ కోర్సుల్లో విద్యార్థులు అత్యుత్తమ గ్రేడ్ పాయింట్లు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారని కళాశాల చైర్‌పర్సన్ శాంతా నాగరాజ్ తెలిపారు. బీకాం (సీఏ) విభాగంలో ఎస్. ఉమ 9.09 పాయింట్లతో, ఎం. నమిత 8.92 పాయింట్లతో అగ్రస్థానాలు సాధించారు. బీఎస్సీ (కెమిస్ట్రీ)లో ఎం. స్వర్ణ 9.02 పాయింట్లు, ఆర్. పావని 8.83 పాయింట్లు సాధించారు. బీసీఏలో ఎం. ధరణి 8.68 పాయింట్లు, వి.హేమలత 8.45 పాయింట్లతో ప్రతిభ చాటారు. బీబీఏలో సి. హేమలత 8.51 పాయింట్లు, ఆర్. దేవవర్షిని 8.03 పాయింట్లు సాధించగా, బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్)లో జె. భరత్ 8.48 పాయింట్లు, జె. ఇమాన్ 8.19 పాయింట్లతో ఉత్తమ ఫలితాలు నమోదు చేశారు. అదేవిధంగా మేనేజీరియల్ అకౌంటింగ్‌లో ఒక విద్యార్థి, అడ్వాన్స్‌డ్ కార్పొరేట్ అకౌంటింగ్‌లో మరో విద్యార్థి 10కి 10 పాయింట్లు సాధించి విశేష ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్‌పర్సన్ శాంతా నాగరాజ్, వైస్ చైర్మన్ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ సుధారాణి అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాప కులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

## ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 19:**
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 55వ జన్మదిన వేడుకలను చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కుప్పం పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు బాణాసంచా పేల్చి, కేక్ కట్ చేసి పరస్పరం పంచుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కుప్పం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి గోపి మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుప్పం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మునిస్వామి, కాంగ్రెస్ నాయకులు నిజాం, గుడిపల్లి మండల అధ్యక్షుడు కృష్ణప్ప, శాంతిపురం మండల అధ్యక్షుడు నంజప్ప, రామకుప్పం మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జన్మదిన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.

## కూటమి ప్రభుత్వంపై మండిపడ్డ
## వైఎస్ఆర్సిపి రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి ద్రాక్షాయని




**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 19:**
కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు రాష్ట్ర వైఎస్ఆర్సిపి మహిళ ప్రధాన కార్యదర్శి ,మాజీ హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ ద్రాక్షాయిని అన్నారు. శుక్రవారం పెనుమూరు మండలంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. .రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచక పాలన పతనమయ్యే రోజులు తొందరలో ఉందని అన్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడిన తీరు సరికాదని అన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాటలకు మీరే కదా కీలకమైన పదవిలో అది హోంమంత్రిలో ఉండి వాడు వీడు అనడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రాజకీయంలో విమర్శలు ప్రతి విమర్శలు సహజమని అన్నారు. మీరు మాట్లాడితే శ్రీరంగ నీతులు మేము మాట్లాడితే బూతులు అని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు అందరూ గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి పార్టీకి ప్రజలు పట్టం కట్టి కూటమి ప్రభుత్వాన్ని త్వరలోనే ప్రజలు బుద్ధి చెప్తారని పేర్కొన్నారు.

వైఎస్ఆర్సిపి నాయకులను పరామర్శించిన

# మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 19:**



అన్నమయ్యజిల్లా పీలేరు మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన వైఎస్సార్సీపీ రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ జనరల్ సెక్రటరీ గుండ్లూరు అమరనాథరెడ్డి సోదరుడు గుండ్లూరు రమేష్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. కొత్తపల్లెకు చెందిన వైఎస్సార్సీపీ నాయకులు సురేష్ రెడ్డి తల్లి కాంతమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న పుంగనూరు శాసనసభ్యులు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శుక్రవారం కొత్తపల్లెలో వారి ఇరువురుని పరామర్శించారు. ఈ కార్యక్ర మంలో ఎంపీపీ కంభం సతీష్ రెడ్డి వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ దండు జగన్మోహన్ రెడ్డి నాయకులు భవనం వెంకటరమణారెడ్డి, మోహన్ రెడ్డి శ్యాంప్రసాద్ రెడ్డి మల్లికార్జు నరెడ్డి, మధుసూదన్ రెడ్డి జయచంద్రారెడ్డి. అమరనాథరెడ్డి, చక్రధర్, భువనేశ్వర్ రెడ్డి ద్వారకనాథ్ రెడ్డి షాకీర్, మునీర్, ఆబీద్, కాలనీ చిన్న. వి.పి. రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

# నొస్టిక్ నాచురల్ ఫ్రూట్ ఐస్ క్రీమ్ షాప్
## ప్రారంభించిన బొజ్జల రిషితా రెడ్డి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్19:**
శ్రీకాళహస్తి పట్టణంలో నూతనంగా నొస్టిక్ నాచురల్ ఫ్రూట్ ఐస్ క్రీమ్ షాప్ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షాప్ యజమాని షోకత్‌కు ఆమె ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. సహజ పండ్లతో తయారైన ఆరోగ్యకరమైన ఐస్‌క్రీమ్‌లను ప్రజలకు అందించాలనే సంకల్పంతో ఈ వ్యాపారాన్ని ప్రారంభించడం అభినందనీయమని బొజ్జల రిషితా రెడ్డి పేర్కొన్నారు. వ్యాపారంలో మరింత అభివృద్ధి సాధించి,ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ సంస్థ మరింత విస్తరించాలని కోరారు. షాప్ యజమాని షోకత్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్తగా ప్రారంభమైన నొస్టిక్ నాచురల్ ఫ్రూట్ ఐస్ క్రీమ్ షాప్ ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు అందించి మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిపురంలో స్కూల్, కాలేజీ బస్సులపై పోలీసుల తనిఖీ




**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై19:**
విద్యార్థుల భద్రత దృష్ట్యా శాంతిపురం మండలంలో నడిచే స్కూల్, కాలేజీ బస్సులపై పోలీసులు శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. చిత్తూరు జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాళ్ళబూదుగూరు ఎస్ఐ ఐ.నరేష్ మరియు సిబంది తో కలసి శాంతిపురం టైలర్స్ స్కూల్ మైదానంలో శుక్రవారం మండలంలోని అన్ని బస్సులను రప్పించి వాహన ఫిట్‌నెస్, భద్రతా పరికరాలు, డ్రైవింగ్ లైసెన్సులు, పత్రాలు, అత్యవసర భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. వాహన యజమానులు, డ్రైవర్లకు విద్యార్థుల భద్రతపై పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించి సూచనలు చేశారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చి ట్రాఫిక్ నిబంధనలు, ప్రభుత్వ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత యాజమాన్యాలు, డ్రైవర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మామిడి రైతులకు అండగా నిలిచిన
## రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయుడు

### రైతులకు టన్నుకు రూ.4 వేల ఆర్థిక సాయం అందించడం అభినందనీయం

**వెదురుకుప్ప, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్19:**



మామిడి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని, రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి ఎన్. నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న సేవలు మరువ లేనివని వెదురుకుప్ప మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు మోహన మురళి పేర్కొన్నారు. గంగాధర నెల్లూరు నియోజ కవర్గంలోని వెదురుకుప్ప మండలం పాతగుంట పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, మామిడి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయానికి మద్దతుగా బాణాసంచా పేల్చి, ముఖ్యమంత్రి చిత్రప టానికి పాలా భిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన మురళి మాట్లాడుతూ.. రాష్ట్రం లోని రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మామిడి సాగు చేస్తున్న రైతు లకు ఒక టన్నుకు రూ.4 వేల చొప్పున ఆర్థిక సాయం అందించే నిర్ణయం రైతుల కు ఎంతో ఊరటని స్తుందని అన్నారు. వ్యవసాయ రంగానికి అండగా నిలుస్తూ రైతుల కష్టాలను అర్థం చేసుకుని ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. రైతులు ఆర్థికంగా బలోపే తం కావడానికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తోంద ని తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా వేలాది మంది మామిడి రైతులకు ప్రత్యక్ష ప్రయో జనం చేకూరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని మండల క్లస్టర్ కన్వీనర్ చంద్రబాబు రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి భాస్కర్ రెడ్డి,సీనియర్ నాయకుడు బాలాజీ నాయుడు,గ్రామ కమిటీ అధ్యక్షుడు అమర్‌నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సిద్ధారెడ్డి, భాష్యంవారి కండిగ బాబు నాయుడు, విజయ్ కుమార్, దేవేందర్ రెడ్డి, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు సమంతకమని, గ్రామస్థులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం

## మండల అభివృద్ధి అధికారి ఏపీఆర్ కుమార్

**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్19:**



అంతర్జాతీయ యోగాదినోత్సవం సందర్భంగా శాంతిపురం మండలంలో ఈ నెల 21న విస్తృతస్థాయిలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఏపీఆర్ కుమార్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వఆదేశాల మేరకు మండలంలోని 114 కేంద్రాల్లో సుమారు 14,000 మంది యోగా చేసేందుకు నమోదు చేసుకున్నారని ఎంపీడీఓ తెలిపారు. 340మంది శిక్షకుల ద్వారా స్వర్ణ గ్రామ సిబ్బంది ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. స్థానిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్వర్ణ గ్రామ కార్యాలయాలు తదితర ప్రదేశాల్లో యోగా ఏర్పాట్లకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు,ప్రజా ప్రతి నిధులు, నాయకులు, విద్యార్థులు, మహిళలు, యోగాభ్యాసకులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

## హరిత రాయబారులకు దుస్తులు, పరికరాల పంపిణీ
### ఎంపీడీవో ఏపీఆర్ కుమార్



**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 19:**
స్వర్ణ కుప్పం – స్వచ్ఛ శాంతిపురం కార్యక్రమంలో భాగంగా పనిచేస్తున్న హరిత రాయబారులకు శాంతిపురం ఎంపీడీఓ కార్యాలయం దుస్తులు, పని పరికరాలు అందజేసింది.మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని 50 మంది హరిత రాయబారులకు రూ. 10 లక్షల విలువైన దుస్తులు, రెయిన్ కోట్లు,బూట్లు,గ్లౌజులు సరఫరా చేసినట్లు ఎంపీడీఓ ఏపీఆర్ కుమార్ తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి పనిచేస్తూ ప్రతిఇంటి నుంచి చెత్త సేకరించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో హరిత రాయబారులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఐవీఆర్ ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల సంతృప్తి స్థాయి మెరుగ్గా ఉన్నందున వారి సేవలను గుర్తించి ఈ పంపిణీ చేపట్టామని ఎంపీడీఓ పేర్కొన్నారు. కెన మాకులపల్లె, రాళ్లబూదుగురు గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో స్థానిక పంచాయ తీ అభివృద్ధి అధికారులు స్వాతి, శివశంకరయ్య,నాయకులు బసవరాజు, కేదార్‌నాథ్, రమేష్, జయరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యోగా నిత్యకృత్యం కావాలి

## ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 19:**
శ్రీకాళహస్తి ఆధునిక ప్రపంచంలో పరుగుల జీవితానికి తోడు సరైన ఆహారం,తగిన శారీరక



వ్యాయామం లేకపోవడం వలన ఎదురయ్యే తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కోవడానికి ప్రతీ మనిషికి యోగా నిత్యకృత్యంగా మారాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు శ్రీకాళహస్తి పురపాలక సంఘం నిర్వహిస్తున్న యోగా సాధన కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ఎన్డీయే కూటమి పార్టీలకు చెందిన పలువురు పాల్గొన్నారు. యోగా సాధన అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ యాంత్రిక జీవితంలో క్షణం తీరిక లేని, నిరంతర ఒత్తిడి మరియు ఆందోళనల మయమైన ఉరుకులు పరుగుల మనిషి జీవితానికి శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత కోసం యోగా ఎంతో అవసరం అని సుధీర్ రెడ్డి ప్రజలకు సూచించారు. ప్రాణాయామం శ్వాస మీద ధ్యాస, ధ్యానం చేయడం ద్వారా శరీరానికి మరియు మనస్సుకు మధ్య సంతులనం ఏర్పరచి, తద్వారా ఒత్తిడిని తగ్గించి, అటు స్థిరత్వాన్ని,ఏకాగ్రతను పెంచవచ్చని తెలిపారు. క్రమం తప్పని యోగా సాధన ద్వారా రోజువారీ పని ఒత్తిడిని అధిగమించి,మానసిక ఆందోళన, నిద్రలేమిని దూరం చేయవచ్చని, అలాగే రోగనిరోధక శక్తి పెరిగి జీర్ణక్రియ మెరుగు పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డా.జి.దశరథాచారి,యం.సుబ్బయ్య, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెంచయ్య నాయుడు, తెలుగుదేశం పార్టీ సీని యర్ నాయకులు మిన్నల్ రవి,గుర్రప్ప శెట్టి,షేక్ ఖాదర్ బాషా,డా.యం.ఉమేష్ రావు, అస్మత్, కోట చంద్రశేఖర్, డి.వి.నారాయణ,మునిరాజా యాదవ్, గోపీనాథ్,షాకీర్ అలీ, పాల్గొన్నారు.

## కీచకవధ నాటకం అలరించింది
## చవటగుంట మహాభారత ఉత్సవాలకు పోటెత్తిన భక్తజనం



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్19:**
చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం చవటగుంట గ్రామంలో జరుగుతున్న 46వ మహాభారత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ప్రదర్శించిన కీచకవధ నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టు కుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి నాటకాన్ని ఆసక్తిగా తిలకించారు. మహాభారతంలోని విరాటపర్వం నేపథ్యంలో ప్రదర్శించిన ఈ నాటకంలో కళాకారులు తమ అద్భుత నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా కీచకుడు, ద్రౌపది, భీముడు పాత్రలను పోషించిన కళాకారులు భావోద్వేగభరితంగా నటించి ప్రశంసలు అందుకున్నారు. ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాలు స్థానికంగా సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పౌరాణిక నాటకాల పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి విరాళదాతలుగా కోలారు తురకాని – వనజాక్షి దంపతులు, డాక్టర్ కోలారు వెంకట ప్రకాష్,డాక్టర్ మీనాక్షి ప్రకాష్ వ్యవహరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు బండి గోవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా యువత కార్య దర్శి బోడిరెడ్డి నరేష్ రెడ్డి, కె.రవిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కోలారుసురేష్, ఆలయ కార్యనిర్వాహక సభ్యులు కామనసాని నరసింహారెడ్డి, మణి, నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులు, గ్రామస్థులు సాంప్రదాయ కళారూపాలను ఆస్వాదిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆలయ అభివృద్ధికి సీఎం వద్ద వినతి
## రాళ్లబూదుగురు అభివృద్ధి పనులపై వినతిపత్రం అందజేత



**శాంతిపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్ 19:**
కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలం రాళ్లబూదుగురు గ్రామంలో నిర్మాణంలో ఉన్న కోదండ రామస్వామి ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరుతూ స్థానిక నాయకులు అమరావతిలో ముఖ్యమంత్రి ఎన్. నారా చంద్రబాబు నాయుడును కలిసి వినతి పత్రం అందజేశారు. రాళ్లబూదుగురు యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్.ఎస్.మణి ఆధ్వర్యంలో నాయకుల బృందం ముఖ్య మంత్రినివాసంలో భేటీ అయి ఆలయంలో మిగిలిన అభివృద్ధిపనులు, మండపం నిర్మాణం,ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. అలాగే గ్రామంలోని మైనార్టీ వర్గాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని షాదీ మహల్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ ప్రత్యేక వినతిపత్రా న్ని సమర్పించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ముఖ్య మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. ఆలయ అభివృద్ధితో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, షాదీ మహల్ నిర్మాణంపై అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. సుమారు రూ.8 కోట్ల వ్యయంతో జరుగుతున్న కోదండ రామస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయితే రాళ్లబూదుగురు గ్రామం ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని నాయకులు పేర్కొన్నారు. ముఖ్య మంత్రి సానుకూల స్పందనతో గ్రామ ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143